"మధురమైన పిల్లలూ - తండ్రి యొక్క ఆజ్ఞ ఉంది, స్వదర్శన చక్రాన్ని తిప్పుతూ తమ బుద్ధియోగాన్ని ఒక్క తండ్రితో జోడించండి, దీనితో వికర్మలు వినాశనమవుతాయి, శిరస్సు నుండి పాపాల భారం తొలగిపోతుంది"

ప్రశ్న:- ఈ పురుషోత్తమ సంగమయుగం యొక్క విశేషతలు ఏమిటి?

జవాబు:- ఈ సంగమయుగమే కళ్యాణకారీ యుగము - ఇందులోనే ఆత్మ మరియు పరమాత్మ యొక్క సత్యమైన మేళా జరుగుతుంది, దీనిని కుంభ మేళా అని అంటారు. 2. ఈ సమయంలోనే మీరు సత్యాతి-సత్యమైన బ్రాహ్మణులుగా అవుతారు. 3. ఈ సంగమములో మీరు దుఃఖధామం నుండి సుఖధామంలోకి వెళ్తారు. దుఃఖాల నుండి విడుదలవుతారు. 4. ఈ సమయంలో మీకు జ్ఞాన సాగరుడైన తండ్రి ద్వారా సృష్టి యొక్క ఆది మధ్యాంతాల పూర్తి జ్ఞానం లభిస్తుంది. కొత్త ప్రపంచం కోసం కొత్త జ్ఞానాన్ని తండ్రి ఇస్తారు. 5. నల్లగా ఉన్న మీరు తెల్లగా అవుతారు.

గీతము:- ఈ పాపపు ప్రపంచం నుండి...( ఇస్ పాప్ కీ దునియా...)

ఓంశాంతి. మధురాతి-మధురమైన పిల్లలు పాటను విన్నారు మరియు వాస్తవానికి కలియుగం పాపపు ప్రపంచమని పిల్లల బుద్ధిలో కూర్చుని ఉంది. ఈ సమయంలో అందరూ పాపాలే చేస్తూ ఉంటారు. తండ్రి వచ్చి పిల్లలైన మీకు కల్ప-కల్పము గతి, సద్గతులను ఇస్తారు, ఎప్పుడైతే పతిత ప్రపంచాన్ని పావనంగా చేయవలసి ఉంటుందో, అప్పుడే పతిత-పావనుడైన తండ్రి వస్తారు, వచ్చి పిల్లలను తమ సమానంగా చేస్తారు. తండ్రిలో ఏ జ్ఞానం ఉంది? మొత్తం సృష్టి చక్రం యొక్క జ్ఞానముంది. పిల్లలైన మీకు కూడా ఈ సృష్టి చక్రము గురించి తెలుసు. ఈ చక్రమంతా ఎలా తిరుగుతుంది, ఈ జ్ఞానము తండ్రిలో ఉంది, అందుకే వారిని జ్ఞాన సాగరుడు అని అంటారు. వారే పతిత-పావనుడు. ఈ చక్రాన్ని అర్థం చేసుకోవడముతో, స్వదర్శన చక్రధారిగా అవ్వడముతో మీరు మళ్ళీ స్వర్గం యొక్క చక్రవర్తీ రాజా రాణిగా అవుతారు. కావున బుద్ధిలో రోజంతా ఈ చక్రము తిరుగుతూ ఉండాలి, అప్పుడు మీ వికర్మలు వినాశనమవుతాయి. సత్యయుగంలో మీరు ఈ చక్రాన్ని తిప్పరు. అక్కడ స్వ అనగా ఆత్మకు సృష్టి చక్రం యొక్క జ్ఞానం ఉండదు. ఈ జ్ఞానము కేవలం సంగమయుగంలో మీకు లభిస్తుంది, సత్యయుగంలోను లభించదు, కలియుగంలోను లభించదు. సంగమానికి చాలా మహిమ ఉంది. కుంభ మేళాను జరుపుతారు కదా. వాస్తవానికి ఇది జ్ఞాన సాగరుడు మరియు నదుల యొక్క మేళా అనగా పరమ ఆత్మ మరియు ఆత్మల యొక్క మేళా. ఆ కుంభ మేళా భక్తి మార్గానికి సంబంధించినది. ఈ ఆత్మ మరియు పరమాత్మ యొక్క మేళా ఈ మనోహరమైన కళ్యాణకారీ సంగమయుగంలోనే జరుగుతుంది, ఇప్పుడు మీరు దుఃఖాల నుండి విడుదలై సుఖములోకి వెళ్తారు, అందుకే తండ్రిని దుఃఖహర్త, సుఖకర్త అని అంటారు. అర్ధకల్పం సుఖము మరియు అర్ధకల్పము దుఃఖము నడుస్తుంది. పగలు మరియు రాత్రి సగం-సగం ఉంటుంది. ఇల్లు కూడా కొత్తగా, పాతగా అవుతుంది. కొత్త ఇంట్లో సుఖము, పాత ఇంట్లో దుఃఖము ఉంటుంది. ప్రపంచం కూడా కొత్తగా మరియు పాతగా అవుతుంది. అర్ధకల్పం సుఖం ఉంటుంది, మళ్ళీ మధ్య నుండి దుఃఖము మొదలవుతుంది. దుఃఖము తర్వాత తిరిగి సుఖం ఉంటుంది. దుఃఖధామం నుండి తిరిగి సుఖధామంగా ఎలా అవుతుంది, ఎవరు తయారుచేస్తారు, ఇది ప్రపంచవ్యాప్తంగా ఎవ్వరికీ తెలియదు. మనుష్యులైతే ఘోర అంధకారంలో ఉన్నారు. సత్యయుగానికి చాలా ఎక్కువ సమయాన్ని చూపించారు. ఒకవేళ సత్యయుగం యొక్క ఆయువు ఎక్కువగా ఉన్నట్లయితే మరి మనుష్యులు ఎంతమంది ఉండాలి. తిరిగి అయితే ఎవ్వరూ వెళ్ళలేరు. అందరూ కలిసి వెళ్ళాల్సిందే. ఎప్పుడైతే తండ్రి వచ్చి ఇంటి యొక్క మార్గాన్ని తెలియజేస్తారో, అప్పుడే తిరిగి వెళ్తారు. తండ్రి సంగమయుగములో వచ్చి ఇంతమంది ఆత్మలకు పూర్తి మార్గాన్ని తెలియజేస్తారు, మనం 84 జన్మల చక్రము తిరిగి వచ్చామని మీకు తెలుసు. సత్య, త్రేతాయుగాలలో మనం ఎన్ని జన్మలు తీసుకున్నాము, అక్కడ ఎన్ని సంవత్సరాలు ఎవరెవరు రాజ్యం చేస్తారు. ఇదంతా మీ బుద్ధిలో ఉంది. సత్యయుగములో 16 కళల సంపూర్ణులుగా, తర్వాత 14 కళలు, ఆ తర్వాత దిగే కళ ఉంటుంది. ఈ సమయంలో చాలా దుఃఖం ఉంది. దుఃఖము పాత ప్రపంచములోనే ఉంటుంది. సత్యయుగాన్ని కొత్త ప్రపంచము, కలియుగాన్ని పాత ప్రపంచము అని అంటారు. ఇప్పుడు ఇది సంగమము. ఇప్పుడు పాత ప్రపంచం యొక్క వినాశనం జరుగుతుంది, తండ్రి కొత్త ప్రపంచాన్ని తయారుచేస్తున్నారు. మీరు పాత ప్రపంచం నుండి బయటకు వచ్చి కొత్త ఇంట్లో కూర్చుంటారు. మీరు అంటారు, మేము కొత్త ప్రపంచములో ఉన్నత పదవిని పొందాలని మేము కొత్త ఇంటి కోసం పురుషార్థం చేస్తున్నాము. తండ్రి కేవలం అంటారు, నన్ను స్మృతి చేయండి, ఇంకే కష్టాన్ని ఇవ్వను. ఎలాగైనా సరే సమయం తీసి ఆజ్ఞను

పాటించాలి. కానీ మాయ ఎటువంటిదంటే ఆజ్ఞను పాటించనివ్వదు. తండ్రితో బుద్ధియోగాన్ని జోడించనివ్వదు. కానీ పిల్లలైన మీరు కల్పక్రితం కూడా పురుషార్థం చేసి ఈ మాయా రూపీ రావణుడిపై విజయాన్ని పొందారు, అప్పుడే సత్యయుగ స్థాపన జరుగుతుంది. ఎవరు ఎంతగా సహాయకులుగా అవుతారో, అంతగా వారికి బహుమానం కూడా లభిస్తుంది. కావున పిల్లలు ఈ జ్ఞానాన్ని మిత్ర-సంబంధీకులకు కూడా ఇవ్వాలి. తండ్రి యొక్క ఆజ్ఞ ఉంది, నన్ను స్మృతి చేయండి ఎందుకంటే అర్ధకల్పం యొక్క వికర్మల భారం శిరస్సుపై ఉంది, దానిని భస్మం చేసుకునేందుకు స్మృతి తప్ప ఇంకే ఉపాయము లేదు. గంగ, యమునలను పతిత-పావని అని అంటారు, మేము పావనంగా అయిపోతామని భావిస్తారు, కానీ నీటితో పాపాలు ఎలా తొలగిపోతాయి. ఇది పతిత ప్రపంచము, అందుకే అందరూ ఓ పతిత పావనా, వచ్చి సత్యయుగాన్ని స్థాపన చేయండి అని పిలుస్తారు. దానిని తండ్రి తప్ప ఎవ్వరూ స్థాపన చేయలేరు. కావుననే ఇది కొత్త ప్రపంచము కోసం కొత్త జ్ఞానము. ఇచ్చేవారు ఒక్క తండ్రి మాత్రమే, శ్రీకృష్ణుడు జ్ఞానాన్ని ఇవ్వలేదు, శ్రీకృష్ణుడిని పతిత-పావనుడు అని అనరు. పతిత-పావనుడైతే ఒక్క పరమపిత పరమాత్మ మాత్రమే, వారు పునర్జన్మ రహితుడు.

శ్రీకృష్ణపురినే విష్ణుపురి అని అంటారని మీకు తెలుసు. శ్రీకృష్ణుని రాజధాని వారిది, రాధే యొక్క రాజధాని వారిది, మళ్ళీ వారు ఇరువురికీ పరస్పరంలో నిశ్చితార్థం జరుగుతుంది. రాధే-కృష్ణులు సోదరీ సోదరులేమీ కాదు. సోదరీ, సోదరులకు పరస్పరంలో వివాహం జరగదు. ఇప్పుడు మీ బుద్ధిలో ఈ విషయాలు తిరుగుతూ ఉంటాయి. ఇంతకుముందు ఇవి తెలియవు. ఇప్పుడు తెలిసింది, రాధే-కృష్ణులే తిరిగి లక్ష్మీ-నారాయణులుగా అవుతారు. స్వర్గం యొక్క మహారాజా మరియు మహారాణి, రాకుమారుడు మరియు రాకుమారి అయిన రాధే-కృష్ణులు గాయనం చేయబడ్డారు. వారి తల్లిదండ్రులకు ఇంతటి ఉన్నత పదవి లేదు. ఇలా ఎందుకు జరిగింది? ఎందుకంటే వారి తల్లిదండ్రులు తక్కువగా చదివారు. రాధే-కృష్ణులకు ఎంత పేరైతే ఉందో, వారి తల్లిదండ్రులకు అంత పేరు లేదు. వాస్తవానికి ఎవరైతే జన్మనిచ్చారో వారి పేరు ఎక్కువగా ఉండాలి. కానీ అలా లేదు, రాధే కృష్ణులే అందరికన్నా ఉన్నతమైనవారు. వారికన్నా పైన ఎవ్వరూ లేరు. రాధే కృష్ణులు మొదటి నంబరులోకి వెళ్ళారు, మళ్ళీ మొదటి నంబరులో మహారాజా, మహారాణిగా కూడా అయ్యారు. జన్మ అయితే తల్లిదండ్రుల వద్ద తీసుకున్నారు, కానీ పేరు వీరిదే ఉన్నతముగా ఉంది. ఇది బుద్ధిలో చాలా బాగా కూర్చోబెట్టాలి. మీరు ఇక్కడ కూర్చున్నప్పుడు ఈ స్వదర్శన చక్రాన్ని తిప్పుతూ ఉండండి. ఈ చక్రాన్ని తిప్పడంతో మీ పాపాలు భస్మమవుతాయి అనగా రావణుని శిరస్సు ఖండించబడుతుంది. ఇది సత్య, త్రేతాయుగాల... చక్రము కదా! మనం మొదట దేవతలుగా ఉండేవారము, తర్వాత క్షత్రియులుగా, వైశ్యులుగా... అయ్యాము. ఇప్పుడు తిరిగి మనం బ్రాహ్మణులుగా అయ్యాము. మళ్ళీ మనమే దేవతలుగా అవుతాము. బాబా ఓం యొక్క అర్థాన్ని వేరుగా అర్థం చేయించారు, హం సో యొక్క అర్థం వేరు. శాస్త్రాలలో ఈ రెండు విషయాలను ఒకటిగా చేసేసారు. వారు ఇలా భావిస్తారు - ఓం అనగా ఆత్మనైన నేనే పరమాత్మ, పరమాత్మయే ఆత్మ - ఇది విరుద్ధమైనది. తండ్రి అర్థం చేయిస్తారు, ఓం అనగా మనము ఆత్మలము, పరమపిత పరమాత్మ యొక్క సంతానము. నేను భగవంతుడిని, ఇదేమీ ఓం యొక్క అర్థం కాదు. ఆత్మనైన నేను నిరాకారుడిని. నా తండ్రి కూడా నిరాకారుడు. సాకార శరీరం యొక్క తండ్రి కూడా సాకారుడు. మనం పరమాత్మ యొక్క సంతానము, కావున మనకు స్వర్గం యొక్క రాజధాని తప్పకుండా కావాలి. తండ్రి మనకు స్వర్గ వారసత్వాన్ని ఇచ్చేందుకు వచ్చారు. రావణుడు తిరిగి అర్ధకల్పం తర్వాత శాపాన్ని ఇస్తాడు, కావున మీరు దుఃఖితులుగా, తమోప్రధానంగా అవుతారు. మళ్ళీ తండ్రి వచ్చి సుఖవంతులుగా అయ్యే వరాన్ని ఇస్తారు. చిరంజీవి భవ అని అనరు. కానీ, నన్ను స్మృతి చేసినట్లయితే ఈ జన్మ సహితముగా జన్మ-జన్మాంతరాల పాపాలు ఏవైతే ఉన్నాయో అవి భస్మమైపోతాయి అని అంటారు, దీనినే యోగాగ్ని అని అంటారు. రావణ రాజ్యములో అందరూ పతితంగా తప్పకుండా అవ్వాలి. ఆత్మ పతితముగా మరియు పావనంగా అవుతుంది, పరమాత్మ అయితే సదా పావనంగా ఉంటారు, వారు అందరినీ పావనంగా చేస్తారు. రావణుడు పతితముగా చేస్తాడు. సత్యయుగములో వికారాలు ఉండవు. అది సంపూర్ణ నిర్వికారీ ప్రపంచము, కావుననే దేవతల ఎదురుగా వెళ్ళి - మీరు సర్వ గుణ సంపన్నులు... అని పాడుతారు. ఈ మహిమను శివుని ఎదురుగా పాడరు. దేవతలు ఎవరైతే పావనంగా ఉండేవారో, వారే పతితంగా అవుతారు, ఇది ఆట. తండ్రి సుఖధామాన్ని తయారుచేస్తారు, శివుడిని తండ్రి అని అంటారు. సాలిగ్రామాలు వేరు, రుద్ర యజ్ఞంలో ఒక పెద్ద లింగాన్ని తయారుచేస్తారు, ఇకపోతే, చిన్న-చిన్న సాలిగ్రామాలను తయారుచేస్తారు. ఆత్మలైన మనం 84 జన్మలు తీసుకుంటాము, ఇతర ధర్మాల వారి కోసం 84 జన్మలు అని అనరు. సిక్కు ధర్మం వారు 500 సంవత్సరాలలో ఎన్ని జన్మలు తీసుకొని ఉంటారు? మనం ఎన్ని తీసుకుంటాము? ఇవి తండ్రి అర్థం చేయిస్తారు, బ్రాహ్మణుల పిలకయే ప్రసిద్ధమైనది. సంగమములోనే సత్యమైన బ్రాహ్మణులు ఉంటారు. ఇది కళ్యాణకారీ యుగము. ఇక్కడే మీ అందరి కళ్యాణము జరుగుతుంది. రావణుడు అకళ్యాణము చేస్తాడు, తండ్రి వచ్చి కళ్యాణము చేస్తారు. కావున తండ్రి మతముపై

నడుస్తూ కళ్యాణము చేయాలి కదా. శ్రీమత్ శివ భగవానువాచ - శివబాబా జన్మ తీసుకోరు, వారు ప్రవేశిస్తారు. ఎప్పుడైతే పాలన తీసుకుంటారో, అప్పుడే జన్మ అని అంటారు. వారెప్పుడూ పాలన తీసుకోరు. కేవలం అంటారు, నా శ్రీమతంపై నడవండి, స్వర్గానికి మీరు యజమానులుగా అవ్వండి, నేను అయితే అలా అవ్వను, నేనైతే అభోక్తను.

బాబా ఆత్మలైన మనకు అర్థం చేయిస్తున్నారని భావించాలి, ఆత్మయే అర్థం చేసుకుంటుంది కదా. ఆత్మయే బారిస్టర్ గా, ఇంజనీర్ గా అవుతుంది. నేను ఫలానా అని అంటుంది. ఆత్మ అన్నది - నేను దేవతగా ఉండేవాడిని, మళ్ళీ 8 జన్మల తర్వాత క్షత్రియునిగా అయ్యాను, తర్వాత 12 జన్మలు తీసుకున్నాను, ఆ తర్వాత నేను పతితముగా అవుతాను. ఇప్పుడు తండ్రి అంటారు, పిల్లలూ, ఆత్మాభిమానీ భవ. ఇవి అర్థం చేసుకోవలసిన విషయాలు. ఆత్మ అంటుంది, మేము సత్యయుగములో ఉన్నప్పుడు మహాన్ ఆత్మలుగా ఉండేవారము, తిరిగి కలియుగములో మహాన్ పాపాత్ములుగా ఉన్నాము. అందరికన్నా అతి గొప్ప, మహాన్ ఆత్మ ఒక్క పరమాత్మ, వారు సదా పవిత్రముగా ఉంటారు. ఇక్కడైతే మనుష్యులు సదా పవిత్రంగా ఉండరు. సదా పవిత్రంగా అయితే సుఖధామంలో ఉంటారు. త్రేతాలో కూడా కొన్ని కళలు తగ్గుతూ ఉంటాయి. ఇప్పుడు మనది ఎక్కే కళ. మనం స్వర్గానికి యజమానులుగా అవుతాము. మళ్ళీ త్రేతాలోకి వచ్చినప్పుడు రెండు కళలు తగ్గుతాయి, ఆ తర్వాత ద్వాపరములో 5 వికారాల గ్రహణం పట్టడంతో నల్లగా అవుతూ ఉంటారు. ఇప్పుడు తండ్రి అంటారు, ఈ 5 వికారాలను దానమిచ్చినట్లయితే గ్రహణం వదులుతుంది, ఆ తర్వాత మీరు సత్యయుగీ సంపూర్ణ దేవతలుగా అయిపోతారు. మొట్టమొదట దేహాభిమానాన్ని విడిచిపెట్టండి, కామ వికారాన్ని దానమివ్వండి. అంతిమంలో నష్టోమోహులుగా అవ్వాల్సి ఉంటుంది. వాస్తవానికి మనం 84 జన్మలు అనుభవించామని ఇప్పుడు ఆత్మలైన మీకు స్మృతి కలిగింది. ద్వాపరము నుండి రావణుడు శ్రాపితులుగా చేసాడు, అందుకే అందరూ దుఃఖితులుగా ఉన్నారు. ద్వాపరములో రాజా, రాణి మొదలైనవారు వ్యాధిగ్రస్తులుగా అయి ఉండరా? ఇది కూడా దుఃఖము అయినట్లే కదా. ఇది ఉన్నదే దుఃఖం యొక్క ప్రపంచము, సత్యయుగము ఉన్నదే సుఖధామము. కావున భగవంతుడి శ్రీమతాన్ని పాటించాలి కదా. అనంతమైన తండ్రి మతాన్ని ఎవరైతే అంగీకరించరో, వారిని మహాన్ కుపుత్రులు అని అనడము జరుగుతుంది. కుపుత్రులైన పిల్లలకు తండ్రి నుండి ఏం వారసత్వం లభిస్తుంది! సుపుత్రులైన పిల్లలు వారసత్వాన్ని కూడా బాగా తీసుకుంటారు. స్వయం వారు పవిత్రముగా అయి ఇతరులను పవిత్రంగా తయారుచేస్తారు. అనంతమైన తండ్రి ఆత్మలను చదివిస్తారు, ఓ ఆత్మలారా, చెవుల ద్వారా వింటున్నారా? వారంటారు, అవును బాబా, మేము మీ శ్రీమతముపై నడుస్తూ తప్పకుండా శ్రేష్ఠముగా అవుతాము. భగవంతుడు ఉన్నతోన్నతమైనవారు అయినప్పుడు, తప్పకుండా పదవి కూడా ఉన్నతోన్నతమైనదే ఇస్తారు కదా. వారు అర్ధకల్పం కోసం స్వర్గం యొక్క వారసత్వాన్ని ఇస్తారు. లౌకిక తండ్రి నుండైతే హద్దు వారసత్వం లభిస్తుంది, అది అల్పకాలికమైన సుఖము. కలియుగములో కాకి రెట్ట సమానమైన సుఖం ఉంటుంది, అందుకే సన్యాసులు ఇళ్ళు-వాకిళ్ళను విడిచిపెడతారు. వారు గృహస్థ ధర్మాన్ని అంగీకరించరు. గృహస్థ ధర్మం సత్యయుగంలోనే ఉంది కదా.

మీకు తెలుసు, ఈ చదువు ద్వారా మనం విష్ణుపురిలోకి వెళ్తాము, దాని కోసం పరమపిత పరమాత్మ మనల్ని చదివిస్తున్నారు. భగవంతుడు ఎవరు, వారి కర్తవ్యమేమిటి? వారు పతితము నుండి పావనంగా ఎలా తయారుచేస్తారు? ఇది భక్తులకు తెలియనే తెలియదు. ఇప్పుడు మీరు పావనంగా అవుతున్నారు. ప్రపంచం ఆ పతిత-పావనుడైన తండ్రిని స్మృతి చేస్తుంది. ఇప్పుడు మీరు సంగమయుగంలో నిలబడి ఉన్నారు, మిగిలినవారంతా కలియుగంలో ఉన్నారు. కలియుగం ఇంకా పసిబిడ్డగా ఉందని వారు భావిస్తారు. కలియుగం ఇప్పుడు వినాశనం కానున్నదని మీకు తెలుసు. ఇప్పుడు మీరు సత్యయుగంలోకి వెళ్ళాలి. తండ్రి మీకు స్మృతినిప్పించారు - నేను కల్ప-కల్పము మీకు వారసత్వాన్ని ఇస్తాను. కావున వారసత్వాన్ని పూర్తిగా తీసుకోవాలి కదా. ఇక్కడ కూర్చుండిపోండి అని తండ్రి ఏమైనా అంటారా. ఇంట్లో గృహస్థములో ఉండండి, కేవలం ఈ స్వదర్శన చక్రాన్ని తిప్పుతూ ఉండండి మరియు నష్టోమోహులుగా అవ్వండి. ఒక్క శివబాబా తప్ప ఇంకెవ్వరూ లేరు, ఇప్పుడు మన కొత్త సంబంధం జోడించబడుతుందని మనకు తెలుసు, కావున పాతవాటిపై మమకారం ఉండకూడదు. కొత్త ప్రపంచము, కొత్త రాజధానిపై మమకారము ఉంచాలి. ఇప్పుడైతే మృత్యువు పూర్తిగా శిరస్సుపై కూర్చుని ఉంది. ఏర్పాట్లు జరుగుతూ ఉంటాయి. సత్యయుగములో అకాల మృత్యువులు ఉండవు. సమయం వచ్చినప్పుడు ఒక పాత శరీరాన్ని వదిలి కొత్తదానిని తీసుకుంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. స్వదర్శన చక్రాన్ని తిప్పుతూ పూర్తి-పూర్తి నష్టోమోహులుగా అవ్వాలి. మృత్యువు శిరస్సుపై ఉంది, అందుకే అందరి నుండి మమకారాన్ని తొలగించి వేయాలి.

2. తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకునేందుకు పూర్తిగా శ్రీమతంపై నడవాలి. ఆత్మాభిమానిగా అయి సుపుత్రుడుగా అవ్వాలి.

వరదానము:- మనసు మరియు బుద్ధిని సదా సేవలో బిజీగా పెట్టుకునే నిర్విఘ్న సేవాధారి భవ

ఎవరైతే ఎంతగా సేవ పట్ల ఉల్లాస-ఉత్సాహాలను పెడతారో, అంతగా నిర్విఘ్నంగా ఉంటారు ఎందుకంటే సేవలో బుద్ధి బిజీగా ఉంటుంది. ఖాళీగా ఉండడముతో ఎవరైనా వేరేవారికి వచ్చే ఛాన్స్ ఉంది మరియు బిజీగా ఉండడముతో సహజంగా నిర్విఘ్నంగా అయిపోతారు. మనసు మరియు బుద్ధిని బిజీ పెట్టుకునేందుకు దానికి టైమ్ టేబుల్ తయారుచేయండి. సేవ కోసం మరియు స్వయము కోసం ఏ లక్ష్యమైతే పెట్టుకుంటారో, ఆ లక్ష్యాన్ని ప్రాక్టికల్ లోకి తీసుకువచ్చేందుకు మధ్య-మధ్యలో అటెన్షన్ తప్పకుండా కావాలి. అటెన్షన్ ఎప్పుడూ టెన్షన్ లోకి మారకూడదు, ఎక్కడైతే టెన్షన్ ఉంటుందో, అక్కడ కష్టమవుతుంది.

స్లోగన్:- సేవ ద్వారా ఆశీర్వాదాలు ఏవైతే లభిస్తాయో - అవే ఆరోగ్యంగా ఉండేందుకు సాధనము.